


## వసుంధర

# పుణ్యకార్యం

నాకు ఒళ్లంతా చలి పుట్టింది. లత ఇంటికి ఎవరు ఏ సమయంలో రాకపోకలు సాగించినా సెక్యూరిటీ అడ్డు ఉండదు. అదే వైకుంఠానికి చావు. ఇలాంటివి దృష్టిలో ఉంచుకునే పూర్వీకులు కథల్లో మాంత్రికుడికి చిలకనూహించారేమో!

పిల్లిని నాలుగు గోడలమధ్య ఉంచి పారిపోవడానికి వీల్లేకుండా తలుపులు మూసి ఎదిరిస్తే అది పులిగా మారుతుంది.

నేను పిల్లినే కానీ నాకూ పులిగా మారే పరిస్థితి ఏర్పడుతోంది.

చిన్న ఉద్యోగం నాది. పెళ్లికానంతవరకూ అమ్మా, నాన్నలకు వేణ్ణీళ్లకు చన్నీళ్లుగా సాయపడగల జీతం నాది. పెళ్లి చేసుకుంటే ఓ మధ్యతరగతి ఇల్లాలి కనీసపు సరదాలు కూడా భయపెట్టగలిగినంత ఆదాయం నాది.

అలాంటి పరిస్థితుల్లో చెల్లికి పెళ్లి సంబంధం కుదిరింది. వరుడి తరఫువారు అడిగింది చాలా తక్కువే అయినా అందుకే తల తాకట్టు పెట్టే ప్రయత్నాల్లో ఉన్నారు నాన్నగారు.

సరిగ్గా అలాంటప్పుడే అమ్మ ఆరోగ్యం చెడింది. డాక్టర్లు ఆపరేషను అవసరమన్నారు. అందుకు ఖర్చు అయిదంకెల్లో ఉంది. అందరం డబ్బు గురించే ఆలోచిస్తూంటే ఇంకా యాభయ్యోపడిలోకి రాని అమ్మ అప్పుడే చావు గురించి ఆలోచిస్తోంది. తను చచ్చిపోతే యాభైవేల

రూపాయలు వస్తుంది. ఇన్సూరెన్స్ నుంచి ఆ విధంగా తన ఆపరేషనే కాదు, కూతురి పెళ్లి సమస్య కూడా తీరుతుందని అమ్మ ఉద్దేశ్యం.

అమ్మ తన చావు గురించి దేవుణ్ణే ప్రార్థిస్తోంది. యాభైవేల కోసం ప్రార్థించవచ్చు కదా అని ఎవరైనా అనవచ్చు కానీ అమ్మ ఒప్పుకోదు. దేవుణ్ణే కూడా ఇవ్వగలిగిందే అడగాలంటుంది అమ్మ. డబ్బు కొందరికి మాత్రమే అనాయాసంగా లభించాలన్నది దేవుడి శాసనం. ఆ కొందరిలో మేము లేమంటుంది అమ్మ.

నాకు భవిష్యత్తుమీద చాలా ఆశ ఉంది. ఆ భవిష్యత్తులో అమ్మను ప్రత్యేకంగా సుఖపెట్టాలన్నది నా కోరిక. అమ్మ ఉనికి నా ఊపిరి. అమ్మ సాహచర్యం నా మనుగడ. అమ్మ లేకుంటే నేను నాలుగు గోడల మధ్యా దారి తెలియకుండా ఇరుక్కున్న పిల్లినవుతాను. అప్పుడు ఎంత చిన్న సమస్యనైనా నన్ను పులిని చేయగలదు.

అందుకే ఆఫీసులో నా సహోద్యోగి భాస్కర్రావుతో "డబ్బుకోసం ఏమైనా చేయాలని ఉంది!" అన్నాను.

"ఎంత కావాలేమిటి?" అన్నాడు భాస్కర్రావు కుతూహలంగా.

"లక్ష రూపాయలు."

"అమ్మో! అంత కావాలంటే ఓ పార్టీ చూపిస్తాను, మరి నువ్వు మర్డర్ చెయ్యగలవా?" అన్నాడు భాస్కర్రావు. ఆ మాటలతడు సరదాకు అన్నాడు.

"ఊఁ" అన్నాను. నేను సరదాగా అనలేదు.

000

అర్ధరాత్రి.

గడియారం పన్నెండు గంటలు కొట్టి పన్నెండు నిముషాలయింది.

నేను తలుపు తట్టాను.

"తలుపు తీసే ఉంది, లోపలకు రావచ్చు!" అందో గంభీర స్వరం.

లోపలకు వెళ్లాను.

గది చిన్నదే కానీ రిచ్‌గా ఉన్నది.

నేలమీద ఖరీదైన తివాచీ, గోడకు పికాసో-మొనాలిసా ఆ గదిలోని రిచెనెస్‌కు మచ్చు తునకలు.

గదిలో ఇద్దరున్నారు.

ఒకాయనకు యాభై ఏళ్లుంటాయి. ఎంతో హుందాగా ఉన్నాడు. సిల్క్ పంచె, లాల్చీ ధరించాడు. ఆ గదికి యజమాని ఆయనే అనిపిస్తుంది.

## ఆదిత్యచోప్రా కొత్తచిత్రం!

'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' చిత్రం గుర్తుండేవుంటుంది పాఠకులకు. ఎందుకంటే ఆ ఏడాది సూపర్‌డూపర్ హిట్టయి, నంబర్ వన్‌గా నిలబడింది. ఇప్పుడు ఆ చిత్రదర్శకుడు ఆదిత్యచోప్రా మరోచిత్రం నిర్మించబోతున్నాడు. దానికి 'యాదేఁ'(స్మృతులు)అని పేరుకూడా పెట్టాడు. ఈ చిత్రం 'దిల్‌వాలే...' కన్నా మెరుగ్గా వుంటుందని తన ఆప్తమిత్రుడొకరితో చెప్పాట్ట ఆదిత్య. మరి అది హిట్టే కనుక, ఇది మరింత హిట్టవుతుందని అనుకోవచ్చా? చెప్పలేం. ఎందుకంటే 'దిల్‌వాలే...' సూపర్ నుత్తిసినిమా అనీ, కథ అస్సలు నడవనేలేదనీ, బోర్ కొట్టించిందనీ, హీరో షారూఖ్‌ఖాన్ అస్సలు బాగా, అంటే గ్లామరస్‌గా కనబడలేదనీ అనేవారున్నారు. మరి 'యాదేఁ' భవిష్యత్తు ఏమిటో ఇప్పటినుంచే చెప్పడం కుదరదుకదా!

ఎస్.



ఇంకొకడు సూటులో ఉన్నాడు. రంగు నలుపు. చూడగానే పచ్చినెత్తురు తాగే రాక్షసుడు అనిపిస్తుంది. ఇద్దరూ ఎదురెదురుగా ఖరీదైన కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. "కూర్చో!" అన్నాడు లాల్చీ మనిషి.

పక్కసోఫాలో కూర్చున్నాను.

"నువ్వు లక్ష రూపాయలు కావాలనుకుంటున్నావు కదూ?" అన్నాడాయన.

"ఊఁ."

"అందుకు ఏమైనా చేయాలనుకుంటున్నావు కదూ!"

"ఊఁ."

"వైకుంఠాన్ని చంపగలవా?"

ఆయన అంత సూటిగా అడిగేసరికి నాకు అరికాళ్లల్లోంచి చలి పుట్టుకొచ్చింది.

ఆయన వైకుంఠం వివరాలు చెబుతున్నాడు. వైకుంఠం సామాన్యుడు కాదు. కోటీశ్వరుడు. ఆయన్ను రక్షించడానికి పెద్ద ఇల్లే కాదు, సెక్యూరిటీ కూడా ఉంది. నావంటి సామాన్యుడికాయన్ను చంపడం కలలో కూడా వీలుపడదు.

"మాంత్రికుడి ప్రాణం చిలకలో ఉంటుంది. వైకుంఠానికీ అలాంటి బలహీనత ఉంది. చెబుతాను, విను!" అన్నాడాయాన.

"వైకుంఠానికి పెళ్లయింది. పెళ్లీడుకొచ్చిన కూతురుంది. అయినా ఆయనకు పరాయి ఆడదాని పట్ల వ్యామోహం పోలేదు. తన సంస్థల్లో పనిచేసే వాళ్లల్లో యువజంటను ఎంచుకుని తన ఔట్‌హవుస్‌లో ఉండమంటాడు. కావాలనుకున్నప్పుడల్లా భర్తను టూర్‌కి పంపుతాడు. భార్యను స్వంతం చేసుకుంటాడు. మోజు తీరాక జంటను మార్చుతాడు.

ప్రస్తుతం ఔట్‌హౌస్‌లో లత ఉంటోంది. ఆమె భర్తను ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమిస్తోంది. భర్త ప్రాణాలు దక్కవన్న భయంతో ఆమె శీలాన్ని వైకుంఠానికి అప్పజెప్పింది. అయితే ఆమెలో అణువణువూ వైకుంఠంపట్ల ప్రతీకార జ్వాలతో రగిలిపోతోంది.

సాయంత్రం ఆరింటికి లత బయటకు వెళ్లి కూరలు తెచ్చుకుంటుంది. బరువెక్కువైనప్పుడు కూలి మనిషిని వెంట తెచ్చుకుంటుంది. ఆ కూలివాడు ఆమె ఇంట్లోనే భోజనం చేసి ఆలస్యంగా వెనక్కు వెడుతూంటాడు. అదంతా వైకుంఠం చేసిన ఏర్పాటు.

లత శీలం మంచిది కాదనీ, భర్త లేనప్పుడు ఆమె పరాయి మగవాళ్లను ఇంటికి తెచ్చుకుంటుందనీ సెక్యూరిటీలో ప్రచారమయ్యేలా చేశాడు వైకుంఠం. ఎప్పుడైనా తన కథ బయటపడితే లత మీద బురద పడాలని ఆ ఏర్పాటు. ఆ సంగతి లతకూ తెలుసు.

తన వెంట కూలివాడు వస్తూంటే సెక్యూరిటీ స్టాఫ్ ముసిముసి నవ్వులు వినిపిస్తుంటే లతకు ఒళ్లు కంపరమెత్తినట్లుంటుంది. కానీ ఆమె అస్వతంత్రురాలు.

"నువ్వు కూలివాడిలా ఆమె వెంట వెళ్లు. అసహాయస్థితిలో ఉన్న వైకుంఠాన్ని చంపు. దర్జాగా బయటకు వెళ్లిపో. నిన్నెవ్వరూ అడ్డుకోరు, గుర్తుపట్టరు. వైకుంఠం తను తీసుకున్న గోతిలో తనే పడతాడు. నీకు లక్ష రూపాయలు వస్తాయి!"

నాకు ఒళ్లంతా చలి పుట్టింది. లత ఇంటికి ఎవరు ఏ సమయంలో రాకపోకలు సాగించినా సెక్యూరిటీ అడ్డు ఉండదు. అదే వైకుంఠానికి చావు. ఇలాంటివి దృష్టిలో ఉంచుకునే పూర్వీకులు కథల్లో మాంత్రికుడికి చిలకనూహించారేమో!

"ఈ పని నేనే ఎందుకు చేయాలి? ఇందుకు గూండాలుంటారు కదా!" అన్నాను. ఆయన అంతరార్థం తెలుసుకోవాలని.

"ఉంటారేమిటీ? వీడు నీ ఎదురుగానే ఉన్నాడు. నేను ఊఁ అంటే రేపు రాత్రికల్లా వైకుంఠం సఫా! ఆ లక్షరూపాయలూ వీడికిస్తే క్లబ్బు కెళ్లి తాగుతాడు. నైట్ క్లబ్ కెళ్లి సుఖిస్తాడు. వైకుఠం చావు ఓ పుణ్యకార్యం కావాలని నా కోరిక. అందుకే ఈ హత్యకు నిన్నెంచుకున్నాను."

నా గురించి ఈయనకు ఎవరు చెప్పారు? భాస్కర్రావా ...? అతడికిలాంటి పరిచయాలున్నాయా?

"తొందరగా చెప్పు. నువ్వు రెడీయేనా?"

"నా గురించి మీ కెవరు చెప్పారు?"

"కంగారుపడకు. ఇందులో భాస్కర్రావు హస్తం లేదు. నువ్వీ హత్య చేసినట్లు మూడోకంటి వాడికి తెలియదు."

"నా గురించి మీ కెలా తెలిసింది?" మళ్లీ అడిగాడు.

"నువ్వు నీ అవసరాలకోసం హత్యయినా చేయాలనుకున్నావు కదా! వెంటనే తథాస్తు దేవతలు తథాస్తు అన్నారు. వాళ్ల మాట నిజం కావాలి కదా. అందుకని నాకు చెప్పారు."

అది నిజం కాదని నాకు తెలుసు. కానీ ఆయనకు నా గురించి ఎలా తెలిసింది? ఎవరు చెప్పారు?

మనిషిని నేరస్థుడిగా మార్చాలని ఈ సమాజం మాటువేసి ఉంటుందా?

"లత కేమవుతుందని నువ్వు బెంగపెట్టుకోకు. వైకుంఠాన్ని చంపి నువ్వు వెళ్లిపోగానే లత ఫోన్ చేసి వాళ్లవాళ్లను పిలుస్తుంది. భయం నటిస్తుంది. లత ఇంట్లో వైకుంఠం చావడం ఆయన భార్యాబిడ్డలకు అవమానం. అందువల్ల శవం ఇంట్లోకి తరలించబడుతుంది. తర్వాత దాన్ని సహజమరణమంటారో, హత్యంటారో, వాళ్ల ఇష్టం, ఖర్మ!"

అప్పటికి నే నో నిర్ణయానికి వచ్చాను.

"నా డబ్బు సమస్య తీర్చుకుందుకు ఏమైనా చేస్తాను కానీ, మనిషిని చంపలేను!"

"నీ ఖర్మ!" అన్నాడాయాన. "కానీ, ఇంకా నీకు టైముంది. రేపు సాయంత్రం దాకా. నీ మనసు మారితే ఈ నంబరుకు ఫోను చేయి. ఈ అడ్రస్సుకు కాంటాక్ట్ చెయ్యి!" ఆయన నా కో కార్డిచ్చాడు. అది జేబులో వేసుకున్నాను.

అంతే! ఉన్నట్లుండి నాకు కళ్లు తిరిగాయి.

000 000 000

గడియారం ఏడు గంటలు కొడుతూంటే మెలకువ వచ్చింది.

కళ్లు నులుముకుంటూ లేచి చుట్టూ చూశాను. నేను నా గదిలోనే ఉన్నాను. దేవుడి గదిలోంచి అమ్మ చదువుతున్న మంత్రాలు వినిపిస్తున్నాయి. బహుశా తన చావుకోసం ప్రార్థిస్తోందేమో!

అమ్మ చావకూడదు. కానీ తను చావాలనుకుంటోంది అనుకుంటే తథాస్తు దేవతలు తథాస్తు అంటారు.

ఉలిక్కిపడ్డాను. తథాస్తు దేవతలు ...

వాళ్లు నా మనసులోని మాటను ఓ మనిషికి అందజేశారు. ఆయన నాచేత హత్య చేయించాలనుకున్నాడు.

అది నిజమేనా?

ఆ దృశ్యం నాకు కళ్లకు కట్టినట్లుంది. కానీ ఎప్పుడు జరిగింది?

నిన్న రాత్రే జరిగుండాలి. కానీ నేను పదింటికల్లా పడుకున్నాను అమ్మ గురించిన ఆలోచనలతో. సరిగ్గా పన్నెండింటికల్లా లేచి ఎక్కడికో వెళ్లాను. ఇంటినుంచి పన్నెండు నిముషాల దూరం.

ఎందుకు వెళ్లానో, ఎలా వెళ్లానో నాకు గుర్తుకురావడంలేదు. కానీ జరిగినదంతా గుర్తుంది. చివర్లో ఓ కార్డు జేబులో పెట్టుకుని కళ్లు తిరిగి పడిపోవడమూ గుర్తుంది.

ఓసారి నన్ను నేను చూసుకున్నాను. లుంగీ, బనియన్...

ఆయన్ను, నేను కలుసుకున్నప్పుడు పాంటు షర్టులలో ఉన్నాను. నాకు బట్టలు మార్చుకున్న గుర్తు లేదు. గదిలో చూస్తే అప్పుడు నేను వేసుకున్న బట్టలు హేంగర్‌కు తగిలించి ఉన్నాయి. లేచి హేంగరు దాకా వెళ్లి చొక్కా జేబు తడిమితే అందులో కార్డు తగిలింది.

అయితే రాత్రి జరిగింది కల కాదు ...

మళ్లీ నాకు అరికాళ్లల్లోంచి చలి పుట్టుకొచ్చింది.

000 000 000

ఆఫీసుకు వెళ్లాక భాస్కర్రావుని పలకరించాను. అతడు ఎప్పటిలాగే ఉన్నాడు. అమ్మ ఆరోగ్యం, హత్య గురించి నిన్న మేము మాట్లాడుకున్న విషయం అతడికి గుర్తున్నట్లే లేదు.

నాకు చాలా అస్థిమితంగా ఉంది.

సాయంత్రంలోగా నేను వైకుంఠాన్ని చంపాలన్న నిర్ణయం తీసుకోవాలి. లేదా మరెవ్వరో వైకుంఠాన్ని చంపుతారు.

అమ్మ అనారోగ్యం పిల్లిలాంటి నన్ను పులిని చేయబోయింది. కానీ పులితోలు కప్పుకుంటే నక్క పులి కాలేదనడానికి నేనే రుజువు. పరిస్థితులు మనిషిని మృగంగా మార్చగలిగితే ఈ సమాజం ఎప్పుడో క్రూరమృగాలతో నిండిపోయి ఉండేది.

హత్య చేసి డబ్బు సంపాదించే అవకాశం రాగానే నాలో మానవత్వం మరింత పెరిగింది. జేబులోంచి కార్డు తీసి అందులోని నంబరు తిప్పాను ఫోన్లో.

అవతల రింగు వినబడింది. ఎవరో ఫోను తీసి హలో అన్నారు.

"లక్ష్మణరావుగారా?"

"ఊఁ, మీరెవరు?"

చెప్పాను.

"ఏం కావాలి?"


"వైకుంఠం విషయంలో మీ ఆలోచన తప్పు!" అన్నాను.

అవతల గొంతులో కంగారు.. "మీరు ఎక్కడనుంచి మాట్లాడుతున్నారు?"

చెప్పాను.

"నేను వస్తున్నాను. మిమ్మల్ని మీ ఆఫీసులో కలుసుకుంటాను."

అవతల క్లిక్‌మంది.



తర్వాత కాసేపటికి "మీకోసం కారులో ఎవరో వచ్చారు సార్?" అన్నాడు ప్యూను.

000 000 000

అతడికి ముప్పై ఏళ్లుంటాయేమో మనిషి రిచ్‌గా ఉన్నాడు. నన్ను చూస్తూనే "నేనే లక్ష్మణరావుని, కారెక్కండి!" అన్నాడు.

"లక్ష్మణరావంటే పెద్దాయననుకున్నాను!" అంటూ కారెక్కాను.

"ఎందుకని?" కారు స్టార్టయింది.

"ఈ కార్డు నా కిచ్చింది పెద్దాయన కాబట్టి!" అతడికి కార్డు చూపించాను.

"మీకీ కార్డు ఎలా వచ్చింది?"

జరిగింది చెప్పాను.

కారు సడెన్ బ్రేక్‌తో ఆగింది. "మీరు నిజమే చెబుతున్నారా?" అన్నాడు లక్ష్మణరావు.

నేను జవాబిచ్చేలోగానే, "నిజం కాకపోతే ఈ కార్డు మీ కెలా వస్తుంది?" అన్నాడు.

"మీ అనుమానం న్యాయమే జరిగింది నిజమని నేనే నమ్మలేకపోతున్నాను" అన్నాను.

"మీరు .. నమ్మారు. అందుకే నాకు ఫోను చేశారు."

"అసలు ముందు పోలీసులకు చెబుదామనుకున్నాను. మిమ్మల్ని నేరస్థుడిగా పట్టించేకంటే నేరం చేయకుండా మిమ్మల్నాపడమే మంచిదని నాకు తోచింది."

"మీరు చాలా మంచివారు. కానీ నన్ను చూశాక కూడా నేను మీరనుకుంటున్న వ్యక్తి కాదని గ్రహించలేదా?"

"కాదని మీరు చెప్పండి. పోలీసుల్ని కలుస్తాను."

లక్ష్మణరావు నవ్వి, "మీరు చాలా తెలివైనవారు. మీకు కార్డిచ్చింది మా నాన్నగారు!" అన్నాడు.

"అనుకున్నాను!" అన్నాను.

"మీరు అనుకోనిది ఒకటుంది. వైకుంఠం నాన్నగారిపట్ల చాలా దారుణంగా వ్యవహరించాడు."


"అయినా హత్య అందుకు సమాధానం కాదు."

"సరే, మీ మాటలు గుర్తుంచుకుంటాను!" కారు వెనక్కి తిరిగింది.

000 000 000

రాత్రి పది గంటల ప్రాంతంలో మా ఇంటి ముందో కారాగింది. ఏమిటో అనుకున్నాం అమ్మను ఆస్పత్రిలో చేర్చడానికి ఏర్పాటది.

ఆస్పత్రిలో ఓ బంధువులాయన కలిశాడు. చెల్లి పెళ్లికి తను డబ్బు సాయం చేస్తానన్నాడు.




ఆయనకు ఆడపిల్లలు లేరు. అందుకని ఆ ఆలోచన పుట్టిందన్నాడు.

అమ్మకు వైద్యం ఉత్తినే... చెల్లికి పెళ్లి ఉత్తినే...

ఒక్క రాత్రిలో మా సమస్యలు తీరిపోయాయి.

000 000 000

తెల్లవారింది.

ఆస్పత్రిలో ఉన్నానేమో అరవకుండానే మెలకువ వచ్చింది.

అప్పటికే వచ్చేసింది దినపత్రిక ...

అందులో ఉంది వార్త మొదటి పేజీలో...

"ప్రముఖ వ్యాపారస్తుడు వైకుంఠం హఠాన్మరణం!"

ఉలిక్కిపడ్డాను. వార్త పూర్తిగా చదివితే అది లక్ష్మణరావు తండ్రి చెప్పిన పథకం ప్రకారం జరిగిన హత్య అయ్యుండదా అనిపించింది.

నాక్కోపం వచ్చింది.

హడావుడిగా వెళ్లి లక్ష్మణరావుకు నంబరు తిప్పాను.

"కారు పంపిస్తున్నా, అన్నీ వివరంగా చెబుతాను!" అన్నాడు లక్ష్మణరావు.

000 000 000

ఆస్పత్రిముందు కారాగింది. అందులోనుంచి గూండాలాంటి వ్యక్తి దిగాడు.

అతణ్ణి నేను గుర్తుపట్టాను. కానీ అతడు నన్నెరగనట్లే ముందుకు సాగిపోయాడు.

"అతని పని ఇక్కడే సార్... మీరు కారెక్కండి!" అన్నాడు డ్రైవరు.

కారెక్కాను. నాకు బుర్ర పనిచేయడంలేదు, ఆలోచిద్దామంటే...

కాసేపటికి నేను లక్ష్మణరావు గదిలో ఉన్నాను.

"మీ గూండా కారు దిగాడు. అంతా నాకు తెలిసింది. మీరు హత్య చేయించారు వైకుంఠాన్ని!" అన్నాను.

"వైకుంఠం మహా పాపి. భార్యాబిడ్డలే ఏవగించుకుంటున్న దుష్టుడు. భార్యే కాక, ఇంకా ఎందరో ఇల్లాళ్ల ఉసురు పోసుకున్న రాక్షసుడు!"

"రాక్షసులనైనా హత్య చేయడం పాపమని పురాణాలు చెబుతున్నాయి!" అన్నాను.

"ఆ రాక్షసుడి హత్య గురించి పోలీసులకు చెబితే ఏమయ్యేది? వాళ్లను నా డబ్బుతో కొనేసి మిమ్మల్నే ఇరకాటంలో పెట్టేవాణ్ణి. పోలీసులకు బదులు నాకు చెప్పడం వల్లనే ఆ రాక్షసుడు చచ్చాడు. అది పుణ్యకార్యమనడానికి సూచనగా మీ సమస్యలు తీరిపోయాయి!"

నాకు సంతోషం కలగలేదు. "నా సమస్య ఇలా తీరాలని నేననుకోలేదు. ఇప్పుడు మీ సమస్య ప్రారంభమవుతుంది. వైకుంఠం కుటుంబం మీ మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది!"

"మీరు బాగా వెర్రివాళ్లు ... అటు చూడండి!" అన్నాడతడు.

అటు చూస్తే ...

గోడకు కాస్త పైన వేలాడుతున్న చిత్రపటం. దానికి పూల మాల వేలాడుతోంది. దాని ముందు ఓ కరెంటు దీపం జ్యోతిలా వెలుగుతోంది.

ఆయన్ను నేను గుర్తుపట్టి ఉలిక్కిపడ్డాను.

"ఆయనే మా నాన్నగారు. పోయి ఏడాదయింది. ఆయన చావుకు ప్రతీకారమే వైకుంఠం హత్య!"

తెల్లబోయి చూస్తున్నాను. నా బుర్ర కొద్దికొద్దిగా పనిచేస్తోంది.

కొడుకు తలపెట్టిన హత్యా ప్రయత్నాన్ని పుణ్యకార్యంగా మార్చాలని తాపత్రయపడుతూ నన్ను కలిశాడాయన.. తాను పోయి సంవత్సరమయ్యాక...

అప్పుడు నా ఒళ్లు భయంతో జలదరించింది. అయితే ఈ జలదరింపులో కృతజ్ఞతా భావం కూడా ఉంది. ■